ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పర్చాలి



సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

చిలకలగూడ : నగరంలో ట్రాఫిక్, కాలుష్య సమస్యలను పరిష్కరించాలని, ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం చిలకలగూడలో సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జోన్ కార్యదర్శి అజయ్‌బాబు మాట్లాడుతు ప్రజారవాణా వ్యవస్థను పటిష్టపర్చేందుకు వారం రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో పలు ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈనెల 8వ తేది గురువారం ఉదయం ఆర్‌టీసీ క్రాస్‌రోడ్‌లోని బస్సుభవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు మల్లేష్, మధు, సూర్యప్రసాద్, లక్ష్మీ, భీమమ్మ, రేణుక, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయాలు కొనసాగిస్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: గద్దర్ ఆశయాలను కొనసాగిస్తామని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమానికి పీహెచ్‌డీ విద్యార్థి సునీల్ శెట్టి, సలీం పాషా అధ్యక్షత వహించగా అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ..గద్దర్ విద్యార్థి దశ నుంచి అనేక పోరాటాలు చేసి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్ అందరివాడని కొనియాడారు. కార్యక్రమంలో కంచర్ల బద్రి, టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. గడ్డం లక్ష్మన్, ప్రొ.అన్సారీ, ప్రొ.కాశీం, ఓయూ పూర్వవిద్యార్థి నేతలు మందాల భాస్కర్, వరంగల్ రవి, వలిగొండ నరసింహ, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే... జర్నలిస్టు జహీర్ అలీఖాన్ వర్ధంతి సందర్భంగా నేతలు నివాళులర్పించారు.

స్ట్రీట్ నెంబర్ బోర్డుల ఏర్పాటు



లాలాపేట: తార్నాక మున్సిఫల్ డివిజన్ పరిధిలోని మాణికేశ్వర్‌నగర్‌లో బస్తీవాసులంతా కలిసి నూతనంగా స్ట్రీట్ నెంబర్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ ముఖ్యతిథిగా పాల్గొని నెంబర్ బోర్డులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాణికేశ్వర్ నగర్ వాసులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



అడ్డగుట్ట: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ వీరు సూచించారు. బుధవారం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అడ్డగుట్ట సీ సెక్షన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరు మాట్లాడుతూ దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



చిలకలగూడ : వయనాడ్‌లో జరిగిన ప్రకృతి విలయాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వయనాడ్ బాధితులను ఆదుకునేందుకు బుధవారం చిలకలగూడ, మైలార్‌గడ్డ, నామాలగుండ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. బాధితులను ఆదుకోవడంతో కేంద్ర బీజేపీ సర్కార్ పూర్తిగా విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, గౌరీనాగరాజ్, శ్రీహరి, మల్లేష్, రవి, యాకయ్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్.. వ్యక్తి అరెస్ట్

రసూల్‌పురా: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తు సరఫరా చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కార్ఖాన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన మేరకు.. ఇందిరానగర్ కానాజీగూడకు చెందిన నతులాల్ మాలి (46) తన ఇంట్లో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లల్లో రీఫిల్లింగ్ చేస్తూ వాటిని వివిధ దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం కార్ఖాన పీఎస్ పరిధిలోని భగవతి స్టీల్ ప్యాలెస్ సమీపంలో నటులాల్ మాలి అనే వ్యక్తి అక్రమంగా గ్యాస్ సిలిండర్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. ఎస్‌ఐ రెడ్డప్ప సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి చేరుకుని ద్విచక్రవాహనంపై సిలిండర్లు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. అనతరం అతను ఇచ్చిన సమాచారం మేరకు కానాజీగూడలోని ఇంటిపై దాడి చేసి రెండు పెద్ద సిలిండర్లు, చిన్న సిలిండర్లు 38, స్వాధీనం చేసుకున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిలకలగూడ: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ మూడవ నంబరు ప్లాట్‌ఫారంపై 60 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. బుధవారం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది.

అరకిలో గంజాయి స్వాధీనం

బౌద్ధనగర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారాసిగూడ ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన మేరకు.. వారాసిగూడకు చెందిన నదీమ్(24) చంద్రాయణగుట్టకు చెందిన అల్తాఫ్(24), అంబర్‌పేట్‌కు చెందిన షైనింగ్ లడ్డు(20)లు మంగళవారం సాయంత్రం జామై ఉస్మానియా సమీపంలోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాలు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్నారు. గమనించిన పోలీసులు వెంటనే వారి వద్దకు వెళ్లి విచారించగా గంజాయి విక్రయానికి వచ్చినట్లుగా తెలుసుకున్నారు. దీంతో ముగ్గురు యువకుల వద్ద లభ్యమైన 580 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

గ్రేటర్ కమిషనర్‌ను కోరిన స్థానికులు



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానిక నాయకులు

లాలాపేట: జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి బుధవారం తార్నాకలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్లు, వివిధ పార్టీల నాయకులు స్థానికంగా నెలకొన్న సమస్యలను డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి సమక్షంలో కమీషనర్ ఆమ్రపాలి ముందు ఏకరువు పెట్టారు. ప్రధానంగా తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కమిషనర్ వద్ద మాట్లాడుతూ తార్నాకలో ఫుట్‌పాత్ అక్రమణ, వాహనాల రద్దీ, వీధి కుక్కల బెడద, దోమల బెడద, అంతర్గత రోడ్ల మరమతు, ఎర్రకుంట చెరువు అభివృద్ది తదితర సమస్యలను వివరించారు. కాగా స్థానిక బీజేపీ నేతలు ఎస్. వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తార్నాక సెయింట్ ఆన్స్ వద్ద ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లిఫ్టులు పని చేయక నిరుపయోగంగా మారిందన్నారు. అర్ధాంతరంగా నిలిచి పోయిన లాలాపేట రహదారి విస్తరణ, డబుల్ బెడ్‌రూం ఇళ్లను లబ్దిదారులకు అందజేయాలనీ పలు సమస్యలను వివరించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై క్రిమినల్ కేసులు



అవగాహన కార్యక్రమంలో నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వర్లు

సనత్‌నగర్: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు బుధవారం బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ)లో కౌన్సెలింగ్ నిర్వహించారు. దీనికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ నార్త్‌జోన్ పరిధిలో బుధవారం నిర్వహించిన రాంగ్‌సైడ్ డ్రైవ్‌లో 70 మంది ఉల్లంఘనులను గుర్తించి వారి వాహనాలను సీజ్ చేశామన్నారు. రాంగ్‌రూట్‌లో డ్రైవ్ చేయడం రోజురోజుకు పెరిగిపోతుందన్నారు. వీరందరికీ ముందుగా అవగాహన కలిగిస్తామని, మార్పు రాకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు కూడా రాంగ్‌రూట్‌లో వెళ్తన్నారన్నారు. కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాపయ్యతో పాటు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా...

సనత్‌నగర్: దిశ డాన్‌బాస్కో ఆధ్వర్యంలో ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కో–ఆర్డినేటర్లు ఐవన్‌వాజ్, కార్తీక్, యేసుదాస్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. జెనెక్సా స్టాఫింగ్ సొల్యూషన్స్‌తో కలిసి ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా గల సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో వివిధ రంగాలకు చెందిన 20కి పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా కిలోల్లో.. రూ.27, నల్లవంకాయ 33, పొడుగు వంకాయ 33, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 23, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 15, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 38, చామగడ్డ 40, మొరంగడ్డ 55, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 15, అరటికాయ 11 మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

పాత టెండర్ల కమిటీని రద్దుచేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు పర్మనెంట్ వీసీని నియమించాకే టెండర్లను చేపట్టాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. బుధవారం ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో విద్యార్థులు పాలన భవనంలో రిజిస్ట్రార్‌ను కలసి పాత టెండర్ల కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టెండర్లను అర్హులైనన స్థానికులకు ఇవ్వాలని, పైరవీలకు తావులేకుండ పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, శివ, లక్ష్మన్, జోష్, కమలాకర్, రాజు, ప్రశాంత్, మహేష్, అంజి, కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన ఆర్పీఎఫ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



అడ్డగుట్ట: ఆలిండియా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ 31వ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, ఆర్పీఎఫ్ ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్ విజేతలకు పతకాలు బహూకరించారు. ఈ పోటీల్లో దక్షిణ రైల్వే 9 బంగారు పతకాలతో సహా మొత్తం 41 పతకాలు సాధించి అగ్రగామిగా నిలిచింది.

బాలిక కిడ్నాప్ కేసు సుఖాంతం

- చిన్నారిని క్షేమంగా తల్లిచెంతకు చేర్చిన జీఆర్పీ పోలీసులు
- అదుపులో నిందితుడు

సికింద్రాబాద్ : సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కిడ్నాప్ అయిన ఐదేళ్ల బాలికను జీఆర్పీ పోలీసులు క్షేమంగా తల్లిచెంతకు చేర్చి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు తెలిపిన మేరకు.. జగద్గిరిగుట్టలో నివాసం ఉంటున్న జావిద్, గేనియ బేగంలు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. గేనియబేగం తన పిల్లలను తీసుకుని జనగాంలో ఉంటున్న నాయనమ్మ దగ్గరకు వెళ్లేందుకు ఈనెల 6న సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కు చేరుకుంది. రాత్రి 8.20 గంటలకు భోజనం తీసుకుని వచ్చేందుకు వెళుతూ కుమార్తెను అక్కడున్న మరుగుదొడ్డి వద్ద కూర్చోబెట్టింది. పెద్దకుమార్తెతో కలిసి భోజనం తీసుకుని వచ్చే సరికి చిన్నకుమార్తె కనిపించలేదు. స్థానికంగా వెతికినా కనిపించకపోవడంతో జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మెహిదీపట్నంలో నిందితుడు చిన్నారితో అనుమానస్పదంగా తిరుగుతుండగా ఆసిఫ్‌నగర్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్ నుంచి కిడ్నాప్‌కు గురైన చిన్నారి, ఆమె ఒక్కరే అని నిర్ధారించుకుని నిందితుడితో పాటు బాలికను జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

నేడు శ్రావణ శుద్ధ చవితి పూజలు

సనత్‌నగర్: శ్రావణ శుద్ధ చవితి సందర్భంగా గురువారం సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం దుర్వా గణపతి పూజ, అష్టోత్తర శతకలశ క్షీరాభిషేకం, గరికతో సహస్రనామార్చన పూజ, అలంకరణ, హారతి, ప్రసాద వియోగం తదితర కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

వర్గీకరణలో ఉపకులాలకు న్యాయం చేయాలి

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణలో మాల, మాదిగ ఉపకులాలకు నష్టం వాటిల్లకుండా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలని తెలంగాణ నేతకాని కుల సంఘాల జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ జాడి మునలయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అట్టడుగున ఉన్న కులానికి మొదటి ప్రాధాన్యం ఇస్తేనే సామాజిక న్యాయం దక్కుతుందని పేర్కొన్నారు. మాదిగ ఉపకులాలను ఎస్సీ ఏ గ్రూపులో, మాదిగ కులాన్ని బి గ్రూపులో, మాల ఉపకులాలను సీ గ్రూపులో, మాల కులాన్ని డి గ్రూపులో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ముడిమడుగుల శంకర్, ఎ.రాజమల్లు, దుర్గం రాజేష్, దర్శనాల భువనచంద్ర, జాడి దేవేంద్ర, దీపక్ కుమార్, రత్నం రాజేష్, సాయికుమార్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి హ్యాండ్లూమ్ ఎక్స్‌పో



రసూల్‌పురా: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో ప్రదర్శన ఈనెల 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్ షా లు మోడల్స్‌తో కలసి క్లాసిక్ గార్డెన్‌లో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి చేనేత వస్త్ర కళాకారులు రూపొందించిన వస్త్రాలు ప్రదర్శనలో ఉంటాయన్నారు.

ఉద్యోగం పేరుతో మహిళకు టోకరా

బంజారాహిల్స్: పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను నమ్మించి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన మోసగాడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని ఇబ్రహీంనగర్‌లో నివసించే రంగలక్ష్మీ శ్రీనగర్‌కాలనీలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ ఏజెంట్. గత జనవరిలో కిరణ్‌కుమార్ అనే కస్టమర్ బుకింగ్ కోసం ఆమె వద్దకు వచ్చి పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో తన సోదరుడు గణేష్‌కు ఉద్యోగం ఇప్పించాలని ఆమె కోరింది. ఖర్చుల పేరిట కిరణ్‌కుమార్ ఆమె వద్ద నుంచి రూ.52 వేలు ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడు. మరోసారి రూ.11.37 లక్షలను తన బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్నాడు. ఒకవేళ ఉద్యోగం కల్పించకపోతే డబ్బు తిరిగి ఇస్తానని బాండ్ కూడా రాసిచ్చాడు. అయితే నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోయేసరికి ఇటీవల ఆమె తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరింది. దీంతో అతడు నెల రోజులుగా ఆమె ఫోన్ కాల్స్‌కు స్పందించకపోగా స్విచ్ఛాఫ్ చేశాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో న్యూసెన్స్..వ్యక్తికి జైలు



టోనీ

చిలకలగూడ : బహిరంగ ప్రదేశంలో మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వ్యక్తికి కోర్టు జైలశిక్ష విధించింది. చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్, అడ్మిన్ ఎస్‌ఐ బాలరాజులు తెలిపిన మేరకు.. హమాలీబస్తీకి చెందిన ఇన్‌ఫెన్ టోనీ (33) ఈనెల 5న మద్యం మత్తులో బహిరంగ ప్రదేశంలో వీరంగం సృష్టించి బస్తీవాసులను భయభ్రాంతులకు గురిచేశాడు. ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు టోనీని అదుపులోకి తీసుకుని ఈ పెట్టీ కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటిన్ కోర్టులో హాజరు పర్చి, వీడియో రికార్డింగ్ ఆధారాలు సమర్పించారు. వీరంగం సృష్టించిన టోనీకి నాలుగు రోజులు జైలుశిక్ష విధిస్తు న్యాయమూర్తి రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు టోనీని చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఓయూలో ఘనంగా బీపీ మండల్ దివస్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీపీ మండల్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీపీ మండల్ కమిషన్ ఇచ్చిన అన్ని సిఫారసులను కేంద్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు నెల్లి సత్య, లెనిన్, వికాస్‌యాదవ్,శ్రీకాంత్, ప్రకాష్ ముదిరాజ్, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్..



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో మోండా మార్కెట్ డివిజన్ గ్యాస్‌మండికి చెందిన వినయ్‌కుమార్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స కోసం ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన లక్ష రూపాయల ఆర్థిక సహాయ పత్రాన్ని బుధవారం వినయ్ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనేక మంది మెరుగైన వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకుండా వైద్యం చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. తమకు ఆర్థిక సహాయం మంజూరు చేయించడం పట్ల ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



సనత్‌నగర్ కేఎల్‌ఎన్‌వై పార్కులో పార్కులో..

పచ్చదనం కోసం..

‘స్వచ్ఛదనం–పచ్చదనం’ కార్యక్రమంలో భాగంగా బుధవారం పలుచోట్ల మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాదు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వక్తలు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ చేస్తున్న కృషికి తోడుగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్ల ఆవరణలో మొక్కలు నాటాలన్నారు.



మధురానగర్‌పార్కులో మొక్కలు నాటుతున్న సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ



బేగంపేట డివిజన్ శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, డీఎంసీ సమ్మయ్య

పీహెచ్‌డీ ప్రక్రియలో ‘చివరి తేదీ’ సంస్కృతి వద్దు



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కొత్తపల్లి తిరుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్‌డీ పరిశోధనలు పూర్తి చేసేందుకు చివరి తేదీ (డెడ్ లైన్) సంస్కృతిని మానుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి హెచ్చరించారు. బుధవారం రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు విధించిన గడువును రద్దు చేయాలని వినతి పత్రం సమర్పించారు. యుజీసీ నిబంధనలకు విరుద్దంగా పీహెచ్‌డీకి గడువు విధించి విద్యార్థులను మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓయూ అధికారులు తీసుకున్న అనవసర నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల సమస్యలపై ఈనెల 9వ తేదీన ప్రహార్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బచ్చుబావుకడు ఆధ్వర్యంలో చేపట్టే పాదయాత్రకు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని ఆ సంస్థ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆగస్టు 9న ఉదయం 11 గంటలకు క్రాంతిచౌక్ నుంచి వికలాంగుల కమిషనర్ కార్యాలయం సంభాజీనగర్ వరకు పెద్ద ఎత్తున పాదయాత్ర నిర్వహించనున్నారని తెలిపారు. వికలాంగులకు రూ.6వేల పింఛన్, యాచకులకు ఉండే విధంగా ఇంటి స్థలం, రాజకీయ రిజర్వేషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు తదితర డిమాండ్లపై పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో సొసైటీ ఫర్ ది డెఫ్ కన్వీనర్ కాటమోని వెంకటేష్‌గౌడ్, కో–కన్వీనర్ సత్యనారాయణ, గౌస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి

ఫిలింనగర్: ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలోని ప్రభుత్వస్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలోనే ఈ అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

చేనేత వస్త్రాలను ధరించి చేయూతనివ్వాలి



కాచిగూడ: జాతీయ చేనేత దినోత్సవాన్ని రస్కరించుకొని బుధవారం నారాయణగూడ పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కందగట్ల స్వామి మాట్లాడుతూ... చేనేత వస్త్రాలను ధరించి చేనేతకు చేయూత ఇవ్వాలన్నారు. చేనేత వృత్తిని రక్షించి నేతన్నలను ఆత్మహత్యల నుంచి కాపాడాలని కోరారు. చేనేత వస్త్రాలు పర్యావరణ అనుకూలమైనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నేతలు అవ్వారి భాస్కర్, కమర్తపు మురళి, చిన్ని రాకేష్, మాచర్ల రాంచందర్, జిల్లా నరేందర్, కటకం రాములు, నాయని సాయితేజ, ఉత్తరపల్లి దయానంద్, గద్దె వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.